# తండ్రిప్రేమ

**బో**నులో పులిలాగా పచారు చేస్తున్నాడు. జుట్టు రేగి ఉంది. మొహం కంది ఉంది. మధ్య మధ్య ఆంబోతల్లే గట్టిగా శ్వాస విడుస్తున్నాడు. పిడికిళ్లు బిగబట్టి పళ్లు పటా పటా కొరుకుతున్నాడు.

"చాలా ఇబ్బందిలో ఉన్నట్టున్నారే?" అన్నాను.

"వాణ్ణా?' అన్నాడు కళ్లు పెద్దవి చేసి, "వాణ్ణి దుంపనాశనం చేస్తాను. వాడి శ్రాద్ధం పిల్లులికి పెడతాను. వాణ్ణి ఉప్పుపాతర్లో ఊరేసి గద్దలకి మాధాకవళం వేస్తాను."

"ఎవర్నో. అల్లుణ్ణి దీవించినట్టు దీవిస్తున్నారే?"

"వాణ్ణే! ఇంకెవర్ని?"

"ఏం చేశాడేవిటి?"

"ఏం చేశాడా?..." ఆయన నోట మాటరాలేదు. "నా కూతుర్ని చేసుకున్నాడు. దాన్ని అనుభవిస్తున్నాడు. దానికి పిల్లల్ని కంటున్నాడు!... నా కూతురు! పువ్వులాంటిది! దానికోసం అప్పుచేసి ఎంత కోమలమైన బట్టలు కొన్నాను. దానికేసి ఎవరూ మొహం చిట్లించటానికి లేకుండా చూశాను. దాన్ని ఎవరూ తప్పు పట్టటానికి వీల్లేకుండా చేశాను. అది రాణి! దేవత! గంధర్వస్త్రీ!"

"పాపం ఒక్కతే కూతురు కాబోలు. మీకంతగా అనిపిస్తుంది."

"ఒక్కతేమిటి? నలుగురున్నారు. త్రాష్టం మొహాలు. వాళ్లు ఎదట కనిపిస్తే తన్నాను. అందులో రెండోదాన్నీ మూడోదాన్నీ మొహం చెక్కేసి రక్తం చూడ బుద్ధయేది. వాళ్లు, నా కడుపున ఎందుకు పుట్టాలి–"

"పుట్టలేదనుకుంటానే!"

"నా ఆఖరు కూతురొక్కత్తే చాలదా? వాళ్లకి తగిన శాస్తే చేశాను. వాళ్లకి బట్టలివ్వలేదు. తిండి కూడా పెట్టలేదు... అసలు వాళ్లవి ఎప్పుడూ ఏడుపుమొహాలే! నా ఆఖరు కూతురు – నా చిలక – నా గోరింక – నా మామిడి పండు – నా ముత్యాల మూట–"

"కానివ్వండి కానివ్వండి."

"దానికి నేను తప్ప ప్రపంచంలో ఇంకో పురుగు - ఈగ - దోమ - పేను లేకుండా చెయ్యటానికి నా శక్తి అంతా ధారపోశాను. అది మిగిలిన వాళ్లని బురద మట్టల్ని చూసినట్టు చూస్తుంటే నాకెంతో ఆనందంగా ఉండేది. అది నన్నే ఓ వెయి అణువు కింద చూసేది. తప్పేముంది? అది రాని, దేవత, కిన్నరి!...

దాన్నీ నన్నూ వేరు చెయ్యటానికి దాని పెళ్లి చెయ్యమన్నారు. చచ్చినా చెయ్యలేదు-"

"మరి మీ అల్లుడు!"

"విను!... రజస్వలానంతర వివాహాలంటే నాకు హడల్! అయినా నా చిలుక కోసం దానిక్కూడా! పాల్పడ్డాను... దానికి పదిహేడేళ్లొచ్చినై! పద్ధెనిమిదీ, పంథోమ్మిదీ! ... ఆహా! ఏమి దాని శరీరం! ఏమి దాని అందం... పెళ్లి మటుకు చెయ్యలేదు. చచ్చినా చేసి ఉండను. నేను రెండు రోజులు పొరుగూరెళ్లితే, నేనొచ్చేటప్పటికి నా బంగారు బొమ్మ పెళ్లి పీటలమీద కూచుని ఉంది. దాని ప్రక్కన ఓ రాక్షసుడు కూచుని ఉన్నాడు.... ఆ రాత్రే గర్భాదానంట!... పురుగులు పడి పోతార్లే!...

"ఏమిటి తల్లీ - నా బంగారు తల్లీ - అంటే నా తల్లి మొహం చిట్లించి 'కనపట్టంలా?' అంది... ఆ రాత్రే నేను నూతిలో గెంతేశాను!"

"ఓవేళ మీ అమ్మాయికి నీమీద ఇష్టంలేదేమో? మిమ్మల్ని చూస్తే పరమ అసహ్యమేమో?"

"ఎవడ్రా. నువ్వు?....'

"అడిగారు గనక చెబుతున్నాను. నేనే మీ అల్లుణ్ని! ఆ రాక్షసుణ్ని!.... నామీద చేయి చేసుకుంటే మక్కెలు విరగదంతాను!... నీ బంగారపు చిలకని నేను ఏ విధంగా మనిషిని చేశానో తెలుసా? గుంజకంటగట్టి పలుపుతో బాదాను. మాసిక వేసిన గుడ్డలు కట్టించాను. తిండి పెట్టక మాడ్చాను... నమ్ము నమ్మకపో, నీ కూతురు మళ్లా మనిషి అయింది. మనిషి అయింతరవాత ఇద్దరమూ గట్టిగా ఆర్నెల్లన్నా సుఖపడలేదు. దానికి ప్రేమంటే ఏమిటో తెలుస్తూ తెలుస్తూ ఉండగానే దాటి వచ్చేసింది; దానికోసమే వెతుకుతున్నాను. పాపిష్టివాడివి. నువు కనిపించావు!"

నా మాటలు మా మామ సాంతం వినకుండానే మూర్ఛపోయినాడు.

***ముద్రణ : ఆనందవాణి, 1 డిసెంబర్ 1944***